## క్లుప్తంగా

### 'విశ్వకర్మ' దరఖాస్తులను పరిశీలించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణ

శింగనమల: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో పీఎం విశ్వకర్మ పథకానికి టైలర్లు, తాపీమేస్త్రీలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించాలని ఎంపీడీఓ రమణ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకానికి తాపీమేస్త్రీలు 40 మంది, టైలర్లు 1871 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. శింగనమల, తరిమెల, వెస్ట్ నరసాపురం, రాచేపల్లి, సలకంచెరువు, మట్లగొంది, కల్లుమడి చక్రాయిపేట, ఆకులేడు పంచాయతీల్లో ఎక్కువ మంది దరఖాస్తు చేశారన్నారు. దరఖాస్తులను పరిశీలించి, అర్హులను ఎంపిక చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని ఎస్కేడీ ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మిడుతూరుకు చెందిన శ్రీరాములు పని మీద గుత్తికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి ఆటోలో మిడుతూరుకు బయలు దేరాడు. ఎస్కేడీ సమీపంలో ఆటోలో నుంచి జారి కింద పడి గాయపడ్డాడు. ఆటో డ్రైవర్ అతడిని ఆస్పత్రికి తరలించాడు.

### అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



చిన్నారులతో ముచ్చటిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని హనుమేష్‌నగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని గుంతకల్లు ఆర్డీఓ వి.శ్రీనివాసరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### నేడు గుండె వైద్య శిబిరం

యాడికి: మండల కేంద్రంలోని వివేకానంద హైస్కూల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు అనంతపురం కిమ్స్ సవీరా ఆస్పత్రి సహకారంతో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విశాలాక్షి ఖాదీ సిల్క్ గ్రామీణ సంస్థ సభ్యుడు నారాయణ స్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుండె నొప్పితో బాధ పడుతున్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


### వర్షం కోసం ఆంజనేయస్వామికి పూజలు



కాయలగేరిలో ఆంజనేయస్వామికి జలాభిషేకం చేసిన దృశ్యం

పెద్దవడుగూరు: వర్షం కోసం మండల కేంద్రానికి చెందిన రాజ్‌కుమార్‌యాదవ్ అనే భక్తుడు ఆంజనేయస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఐదు గంటల నుంచి కాయలగేరిలోని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 101 కడవల నీళ్లతో అభిషేకం చేశారు. రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని, వర్షం కురిపించాలని కోరాడు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

### కసాపురంలో పునర్వసు పూజలు



ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పునర్వసు తిరునక్షత్రం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం పునర్వసు పూజలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ యాగశాలలో స్వామి ఉత్సవ మూర్తులకు తిరుమంజన స్నపన చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బాబోయ్ జింకలు!



పంటను మేస్తున్న జింకల గుంపు

యల్లనూరు: జింకలు చెంగుచెంగున ఎగురుతుంటే ఎవరికైనా ఆనందమే. అయితే ఈ జింకలు మండలంలోని రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. జింకలు గుంపుగా వచ్చి వేరుశనగ, సోయాచిక్కుడు, చీనీ, అరటి, కూరగాయల పంటలపై దాడిచేసి ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. యల్లనూరు మండలంలోని నిట్టూరు, జంగంపల్లి, పాతపల్లి, వెన్నపూసపల్లి, గడ్డంవారిపల్లి, దుగ్గుపలి, మల్లాగుండ్ల తదితర గ్రామాల్లో జింకలు గుంపులు గుంపులుగా పొలాల్లో సంచరిస్తూ సాగు చేసిన పంటలు తినేయడంతోపాటు నాశనం చేస్తున్నాయి. చీనీచెట్లను కొమ్ములతో రుద్ది విరగ్గొడుతున్నాయి. గతంలో పలుమార్లు అటవీశాఖ అధికారులకు జరిగిన పంట నష్టంపై అంచనాలను తయారు చేసి ఇచ్చినా ఫలితం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి పూట కొంత మంది రైతులు పంటలకు కాపలా వెళ్తున్నారు. అయినా ప్రయోజనం లేకపోతోంది. వేరుశనగ, సోయాచిక్కుడు, చీనీ, అరటి, కూరగాయల చెట్లను పాడుచేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జింకల దాడికి తట్టుకోలేక అన్నదాతలు పంటలను సాగు చేయలేని పరిస్థితి. అధికారులు స్పందించి జింకల బెడద నుంచి పంటలను కాపాడాలని అన్నదాతలు కోరుతున్నారు.

## ముగిసిన మండల స్థాయి క్రికెట్ టోర్నీ




బాలురు, బాలికల విభాగంలో విజేతగా నిలిచిన ఎస్‌జేపీ హైస్కూల్ జట్లు

గుంతకల్లు: స్థానిక ఎస్‌జేపీ హైస్కూల్‌లో గత నెల 25 నుంచి ఆర్డీటీ ఆధ్వర్యంలో ప్రారంభమైన మండల హైస్కూల్ లెవల్ క్రికెట్ టోర్నీ ముగిసింది. బాల బాలిక విభాగాల్లో నిర్వహించిన ఈ క్రికెట్ టోర్నీలో ఎస్‌జేపీ హైస్కూల్ బాల, బాలికలు జట్లు విజయం సాధించడం విశేషం. బాలుర విభాగం ఫైనల్ మ్యాచ్‌లో విజ్ఞాన్ స్కూల్ జట్టుపై ఎస్‌జేపీ హైస్కూల్ జట్టు, బాలిక విభాగంలో సరోజిని మున్సిపల్ హైస్కూల్ జట్టుపై ఎస్‌జేపీ హైస్కూల్ జట్టు విజయం సాధించాయి. ముఖ్య అతిథులుగా ఆర్డీటీ పర్యవేక్షకుడు యుగంధర్‌రెడ్డి, మండల ఆర్డీటీ కోచ్ ఇనాయతుల్లా హాజరై కప్‌తోపాటు క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఏడీసీఎ కోచ్ షోయబ్, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు. కాగా సరోజని నాయుడు హైస్కూల్‌కు చెందిన కెప్టెన్ బట్నపాడు నందిని బెస్ట్ ఉమెన్ బ్యాటర్‌గా, బోయరాణికి బెస్ట్ బౌలర్‌గా ఎంపిక కావడంతో శనివారం పాఠశాలలో పీఈటీ సైరాబాను సమక్షంలో అభినందించారు.

## రాత్రయితే వైద్యం బంద్



శనివారం రాత్రి ఏడుగంటల సమయంలో మూసివేసిన ఆస్పత్రి తలుపులు

పెద్దపప్పూరు: పేరుకు 24 గంటల ఆస్పత్రి అన్న మాటే గానీ రాత్రి పూట అత్యవసర చికిత్స కోసం మండలకేంద్రంలోని పీహెచ్‌సీకి వెళ్తే మూసిన తలుపులే దర్శనమిస్తాయి. ఒకరు సెలవుపై ఉండగా మరొకరు ట్రిప్ మిస్ కావడం వల్ల రాలేకపోయానని చెప్పడం పెద్దపప్పూరు పీహెచ్‌సీలో పని చేసే వైద్యులకు అలవాటుగా మారిందని మండల ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఒక్కోసారి స్టాఫ్ నర్స్ మాత్రమే అందుబాటులో ఉంటారని, పరిమితికి మించి వైద్యం చేయాల్సి వస్తే ఆమె తాడిపత్రి ఆస్పత్రికి రెఫర్ చేస్తుంటారని వాపోయారు. రాత్రి సమయాల్లో తాడిపత్రి పట్టణానికి వెళ్లడానికి వాహన సదుపాయం లేక రోగులు, క్షతగాత్రులు చికిత్స కోసం వస్తే వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. గత్యంతరం లేక ఆర్ఎంపీ వైద్యులను సంప్రదించాల్సిన దుస్థితి నెలకొంది. శనివారం రాత్రి 7గంటల సమయంలో 'సాక్షి' పీహెచ్‌సీని సందర్శించి అక్కడ విధులు నిర్వహిస్తున్న స్టాఫ్‌నర్స్ అంజలితో మాట్లాడగా తాను నైట్ డ్యూటీ చేస్తున్నాని, తాను తప్ప మరో వైద్యసిబ్బంది అందుబాటులో లేరన్నారు. ఇదే విషయమై సీహెచ్‌ఓ భారతిని ఫోన్ ద్వారా సంప్రదించగా తాము ఫీల్డ్‌లో ఉంటామని, రాత్రి పూట స్టాఫ్ నర్స్ వైద్య సేవలందిస్తారని ఆమె సమాధానమిచ్చారు.

## భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



ఏడు శనివారాల వ్రతంలో పాల్గొన్న మహిళలు

తాడిపత్రి అర్బన్: లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న ఏడు శనివారాల వ్రతాన్ని ఐదో వారం పట్టణంలోని శ్రీచింతల వెంకటరమణస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మురళీబట్టార్ నేతృత్వంలో మహిళలు సామూహిక వ్రతమాచరించారు. ఈ సందర్భంగా ఆలయంలోని ప్రధాన ఆది దేవతలైన శ్రీలక్ష్మి సహిత చింతల వేంకటరమణస్వామికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్ చింతల వేంకటరమణస్వామిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం ఏడు శనివారాల వత్రాన్ని ప్రారంభించారు. వత్రంలో పాల్గొన్న మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

## తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


శ్రీధర్‌మూర్తి


బ్రహ్మయ్య


నాగరాజు

పామిడి: పామిడి తహసీల్దార్‌గా జీ శ్రీధర్‌మూర్తి శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీలో భాగంగా ఉరవకొండ నుంచి మంత్రాలయానికి ఆయన తహసీల్దార్‌గా వెళ్లారు. ఎన్నికలు ముగియడంతో గతంలో ఇక్కడ పనిచేస్తున్న చంద్రశేఖర్‌నాయక్ తిరిగి కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీధర్‌మూర్తి బదిలీపై వచ్చారు. తోటి సిబ్బంది, ప్రజల సహకారంతో రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మండలాన్ని అభివృద్ధిపథంలో పయనింపజేస్తానని నూతన తహసీల్దార్ అన్నారు.

**శింగనమల తహసీల్దార్‌గా బ్రహ్మయ్య**

శింగనమల: శింగనమల తహసీల్దార్‌గా బ్రహ్మయ్యను నియమించినట్లు శనివారం కలెక్టర్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎన్నికల ముందు జిల్లాలోని గుమ్మఘట్ట తహసీల్దార్‌గా పనిచేశారు. బదిలీల్లో భాగంగా ఆయనను శింగనమల తహసీల్దార్‌గా నియమించారు. ఆయన సోమవారం బాధ్యతలు తీసుకుంటారని రెవెన్యూ అధికారులు తెలిపారు.

**యల్లనూరు తహసీలార్‌గా నాగరాజు**

యల్లనూరు: బదిలీల్లో భాగంగా యల్లనూరు తహసీల్దారుగా నాగరాజును కలెక్టరు వినోద్‌కుమార్ నియమించారు. సోమవారం ఫిర్యాదుల విభాగం రోజు ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు. ఆయనకు 2016 నుంచి 2018 వరకూ యల్లనూరు తహసీల్దారుగా పని చేసిన అనుభవం ఉంది.

**గార్లదిన్నె తహసీల్దార్‌గా ఈరమ్మ**

గార్లదిన్నె: గార్లదిన్నె మండలం తహసీల్దార్‌గా ఈరమ్మను నియమిస్తూ కలెక్టర్ వినోద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్ తెలిపారు. ఈసందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ ఈరమ్మ సోమవారం తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకుంటారన్నారు.

### నెట్టికంటుడిని దర్శించుకున్న జడ్జి



ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న జడ్జి హరి

గుంతకల్లు రూరల్: గుత్తి ఆరో అదనపు జడ్జి ఎం.హరి శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జడ్జి కుటుంబ సభ్యుల పేరున ప్రత్యేకపూజలు నిర్వహించిన అర్చకులు ఆయనకు స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు.

### వ్యాపారి ఆత్మహత్య



బాబ్జాన్ (ఫైల్)

పామిడి: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన ఓ నైటీల వ్యాపారి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన శనివారం పామిడి దబాడే వీధిలో చోటుచేసుకుంది. నైటీల వ్యాపారం చేసుకుంటూ బాబ్జాన్ (32) కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. కొంతకాలంగా ఆయన అనారోగ్యం బారిన పడడంతో పాటు నైటీల వ్యాపారంలో లక్షల రూపాయల్లో నష్టం వాటిల్లింది. దీంతో ఇంటిపైన గదిలో ఆయన ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి గర్భిణి అయిన భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సచివాలయ ఉద్యోగులపై కలెక్టర్ కొరడా

- ఆరుగురికి షోకాజ్ నోటీసులు

యల్లనూరు: విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై కలెక్టర్ వినోద్‌కుమార్ కొరడా ఝులిపించారు. పింఛన్ల పంపిణీ ఉదయం 6 గంటలకు ప్రారంభించాల్సి ఉండగా ఆలస్యంగా ప్రారంభించారనే నేపథ్యంలో ఆరుగురు సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. వివరాల మేరకు.. చింతకాయమంద-1 సచివాలయంలో మహిళా పోలీస్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, డిజిటల్ అసిస్టెంట్, మల్లాగుండ్ల సచివాలయంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ , కల్లూరు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ కు షోకాజ్ నోటీసులు అందాయి.

**ఇద్దరికి మెమోలు**

తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, అధికారులు పరిష్కారం చూపడంలో నిర్లక్ష్యం చేశారని గత బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే బండారు శ్రావణికి సమస్యను తెలియజేశారు. ఈ నేపథ్యంలో విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నారని సమస్య జఠిలమైందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రజ, కూచివారిపల్లి పంచాయతీ కార్యదర్శి గంగాదేవికి ఎంపీడీఓ వీరరాజు మెమోలు ఇచ్చారు. గ్రామాల్లో పర్యటించి తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఎంపీడీఓను ఎమ్మెల్యే ఆదేశించారు. మెమోలకు రెండురోజుల్లో సంజాయిషి ఇవ్వాలని ఎంపీడీఓ ఆదేశించారు.

## వాడీవేడిగా సర్వసభ్య సమావేశం




మాట్లాడుతున్న ఎంపీపీ బొంబాయి ఉమాదేవి

యాడికి: మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. శనివారం ఎంపీపీ బొంబాయి ఉమాదేవి అధ్యక్షతన మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీడీఓ సావిత్రి నిర్వహించిన సమావేశంలో సభ్యులు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ముందుగా అధికారులు తమ శాఖల ద్వారా అందించిన సేవలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బొంబాయి మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సకాలంలో సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యతో రాత్రిళ్లు నిద్ర పోలేక పోతున్నారని, రేషన్ దుకాణాల వద్ద రేషన్ పంపిణీ చేస్తున్ననారని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాల రేషన్ ను ప్రజల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేసేవారన్నారు. మండలంలో ప్రజలు మురుగు సమస్యతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో పయనింపచేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటేస్, ఆర్ఐ శ్రీధర్ బాబు, ఏఓ మహబూబ్ బాష, ఏఈలు, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మందకృష్ణ పోరాటం మరువలేనిది



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

గుంతకల్లుటౌన్: ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల పాటు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ చేసిన పోరాటం మరువలేనిదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు కళావతి అన్నారు. శనివారం స్థానిక మోదినాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. అనంతరం మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు నరసింహులు, బీజేపీ నాయకురాళ్లు పద్మ, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాలు అత్యంత శ్రేష్ఠమైనవి



గుంతకల్లులో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం



పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడులో సామూహిక సీమంతాల దృశ్యం

గుత్తి: తల్లి పాలు అత్యంత శ్రేష్ఠమైనవని సీడీపీఓ ఢిల్లీశ్వరి అన్నారు. గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లిలో శనివారం సూపర్‌వైజర్ నాగేశ్వరి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రతి తల్లీ తన బిడ్డలకు తప్పనిసరిగా చనుపాలు ఇవ్వాలన్నారు. డబ్బా పాలు తాపిండచం వల్ల బిడ్డల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సుజాత , గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష అని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్ బాబు సూచించారు. శనివారం మండలంలోని కసాపురంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు.

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడు, మిడుతూరు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ తాడిపత్రి సీడీపీఓ షాజిదాబేగం, క్రిష్టిపాడు మహిళా వైద్యురాలు త్రివేణి, హెల్త్ సూపర్‌వైజర్ విజయ భాస్కర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శింగనమల: శింగనమలలో తల్లిపాల పాముఖ్యతపై విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. తరిమెల పీహెచ్‌సీ వైద్యాధికారి శంకర్‌నాయక్, ఎంపీడీఓ రమణ, హెల్త్ ప్రొవైడర్ దివ్యభారతి, ఏఎన్ఎం శైలజ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పామిడి: స్థానిక 17వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ హెల్త్ సూపర్‌వైజర్లు రామలక్ష్మి, టీ శ్రీరామిరెడ్డి , ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్‌బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: తల్లిపాలు బిడ్డకు ఆరోగ్య కవచమైనవి అని కొర్రపాడు పీహెచ్‌సీ హెల్త్ ఎడుకేటర్ ఫర్వీన్ అన్నారు. శనివారం మండలంలోని కొర్రపాడు పీహెచ్‌సీ పరిధిలోని నీలారెడ్డిపల్లిలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం సందర్భంగా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాజేంద్రప్రసాద్, రామలక్ష్మి, సురేఖ పాల్గొన్నారు.

### 6న కౌలు భూమి వేలం

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని చెన్న క్రిష్ణ స్వామి ఆలయానికి చెందిన మాన్యాన్ని కౌలు చేయడానికి ఈనెల 6న సాయంత్రం 3 గంటలకు క్రిష్ణస్వామి ఆలయంలో వేలం నిర్వహించనున్నట్లు ఈఓ సుబ్రహణ్యం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సర్వేనెంబర్ 2018లోని 6.94 ఎకరాలకు వేలం ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనదలచిన రైతులు ముందుగా రూ.1000 చెల్లించాలన్నారు.

### 6న షాపుల వేలం

శింగనమల: మండలంలోని శివపురం పెద్దమ్మ దేవాలయం వద్ద టెంకాయలు, పూజా సామగ్రి , పూలహారాలు, గాజులు, దారాలు, బొమ్మలు విక్రయ హక్కులకు ఈ నెల 6న షాపుల వేలం వేస్తున్నట్లు దేవదాయ శాఖ ఏఈ శోభ తెలిపారు.

### మద్యం మత్తులో యువకుడిపై దాడి

తాడిపత్రి అర్బన్: మద్యం మత్తులో ఓ యువకుడిపై దాడి చేసిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. అర్బన్ సీఐ నాగేంద్రప్రసాద్ వివరాల మేరకు.. పట్టణంలోని చాంద్ థియోటర్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి యువకులు అల్లాబకాష్, ఖాజాబాషా, జాఫర్, మౌలాలీ, దాదు మద్యం సేవించారు. ఆ మత్తులో అల్లాబకాష్‌తో వాగ్వావాదానికి దిగి ఖాజాబాషా, జాఫర్, మౌలాలీ, దాదు కలసి అల్లాబకాష్‌పై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### 12 బస్తాల బియ్యం వితరణ



సరుకులు అందజేస్తున్న పైలా దంపతులు

తాడిపత్రి రూరల్: మండలంలోని అవుల తిప్పాయపల్లి వద్ద ఉన్న జీవనాయలానికి శనివారం 12 బస్తాల బియ్యాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య వితరణ చేశారు. వివాహ వార్షికోత్సవం సందర్భంగా పైలా దంపతులు జీవనాలయానికి వచ్చి బియ్యం బస్తాలను అందించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ జీవనాలయంలో 50 మంది మతిస్థిమితం లేని వారు ఉన్నారన్నారు. వారికి వైద్యం , మందులు, నిత్యవసర సరుకుల ఖర్చును అందిచేందుకు దాతలు ముందుకు రావాలన్నారు.

### శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో శనీశ్వరుడు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన వెలసిన శనీశ్వరుని దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో ప్రధాన అర్చకుడు బాబాస్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కుంకుమాభిషేకం, అర్చనలు, తైలాభిషేకం పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

### ఈ- పంట నమోదు తప్పనిసరి



వివరాలను తెలుసుకుంటున్న ఏడీఏ రవి

బుక్కరాయసముద్రం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంట వివరాలు ఈ క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ ఏడీ రవి సూచించారు. శనివారం మండలంలోని రేకులకుంట గ్రామంలో రైతులు సాగు చేసిన పంటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ క్రాపింగ్ చే యించు కోవడం వలన విపత్తుల ద్వారా పంట నష్టపోతే ప్రభుత్వం నష్ట పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి రైతూ 1-బి, పట్టాదారు పాసుపుస్తకం, సెల్‌ఫోన్ నెంబర్, తప్పని సరిగా ఆర్బీకేలో అందజేసి ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్యాం సుందర్‌రెడ్డి, విస్తరణ అధికారి జ్ఞాన జ్యోతి, జ్యోష్ణ, తిరుమలేష్, రైతులు పాల్గొన్నారు.

### సచివాలయాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు వార్డు సచివాలయాలను శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. సచివాలయం-5, 6, 8, 9లో ఆయన రికార్డులు పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. సత్వరమే ప్రజలకు సేవలు అందించాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

### ఇసుక టిప్పర్ పట్టివేత

శింగనమల: మండలంలోని పెరవలి, జలాలపురం, కొరివిపల్లి, ఇరువెందల, నిదనవాడ, తరిమెల, కల్లుమడి సమీపంలోని వంకలు, పెన్నానది నుంచి ఇసుకను భారీగా తరలిస్తున్నారు. శనివారం తెల్లవారుజామున శింగనమల పోలీసులకు సమాచారం రావడంతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.